చెదురుతున్న పర్యాటక కల

- కలెక్టర్ ఆదేశించినా కదలని యంత్రాంగం
- అధ్యయన పర్యటన, సామగ్రి తరలింపుతో సరి
- నైరాశ్యంలో పూబెల్లి గిరిపుత్రులు


పూబెల్లి గ్రామం

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వ నూతన పర్యాటక పాలసీకి అనుగుణంగా జిల్లాలో అందుకు అనువైన ప్రాంతాలను కలెక్టర్ జితేష్ పాటిల్ ప్రత్యేక చొరవతో అన్వేషించారు. ఆకస్మిక పర్యటనలో ఆకట్టుకున్న పూబెల్లి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఈ మేరకు స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేశారు. కానీ ఆచరణకు నోచుకోవడం లేదు.

తొమ్మిది నెలల క్రితం అంకురార్పణ...
నియోజకవర్గంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా పూబెల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. అక్టోబర్ 3, 2024న గ్రామంలో సర్వే ప్రారంభించేందుకు వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గ్రామ పొలిమేరలో చెరువు, చుట్టూ పచ్చని చెట్లను తిలకించి ముగ్ధులయ్యారు. సహజత్వంతో రూపుదిద్దుకున్న అందాల పొదరిల్లు పూబెల్లి అని అభివర్ణిస్తూ గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. నాటి నుంచి పలుమార్లు గ్రామాన్ని సందర్శించి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర ప్రణాళికపై స్థానిక అధికారులకు సూచనలిచ్చారు. కానీ తొమ్మిది నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

ఇదీ ప్రణాళిక..
గ్రామ పొలిమేరలో ఉన్న చెరువును కేంద్రంగా చేసుకొని పర్యాటకులు విడిది చేసేలా నాణ్యతతో గుడారాల ఏర్పాటు, చెరువులో బోటింగ్, సాయంత్రం సరదాగా ఆటలు ఆడుకునేందుకు వీలుగా స్థలాన్ని సరిచేయడం, ఆటవిడుపుగా సైక్లింగ్ చేసేందుకు మార్గం సిద్ధం చేయడం, రాత్రివేళ చలిమంటలు (క్యాంప్ ఫైర్) వేసుకునేలా ఏర్పాట్లు, రుచికరమైన ఆహారం, సోలార్ ప్లాంట్ లేదా సైలెంట్ జనరేటర్‌ను సమకూర్చడం, విడిదికి సమీపంలో టాయిలెట్ల నిర్మాణం తదితర సౌకర్యాలతోపాటు పర్యాటకులు ఆటవిడుపుగా గ్రామాన్ని సందర్శించడం, సమీపంలోని ప్రకృతి అందాలను తిలకించేందుకు గ్రామస్తులు వారికి గైడ్‌లుగా వ్యవహరించడం.. ఇలా సమగ్రమైన ప్రణాళికను కలెక్టర్ వివరించారు.

బ్లాక్ బెర్రీ దీవి సందర్శనతో సరి..
పూబెల్లిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించేలా ములుగు జిల్లా బ్లాక్‌బెర్రీ దీవికి గ్రామస్తులను పంపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో డిసెంబర్ 26న గ్రామపంచాయతీ కార్యదర్శితో సహా ఎనిమిది మంది సభ్యులతో ప్రతినిధి బృందాన్ని సందర్శనకు పంపారు. కానీ నేటికీ సందర్శనలో గుర్తించిన విశేషాలు, అందుకు అనుగుణంగా పూబెల్లి ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పనులపై పర్యటనకు వెళ్లిన ప్రతినిధి బృందంతో అధికారులు సమీక్షించిన దాఖలాలు లేవు.

కనిపించని కదలిక... కలెక్టర్ దిశానిర్దేశం చేసి నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయి అధికారుల్లో మాత్రం కదలిక లేదు. వనరులు ఉన్నప్పటికీ ఒక గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తుల భాగస్వామ్యం తప్పనసరి. అందుకు గ్రామస్తులు సిద్ధంగా ఉన్నా అధికారులు సహకరించకపోవడం విచారకరం. గుడారాల ఏర్పాటు కోసం కలెక్టర్ పంపించిన సామగ్రి పంచాయతీ కార్యాలయంలోనే మూలుగుతోంది.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ పాటిల్ (ఫైల్)

ఎంతో ఆశించాం..


జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. చాలా సంబురపడిపోయాం. ఎంతో చేస్తారని ఆశించాం. కలెక్టర్ ఆదేశాలతో ప్రారంభంలో స్థానిక అధికారుల హడావుడి మినహా అభివృద్ధి జాడ లేదు.
– మచ్చ సాయమ్మ, గృహిణి, పూబెల్లి

కలెక్టర్ స్పందించాలి..


శతాబ్దాల చరిత్ర కలిగిన పూబెల్లిని ఒక కలెక్టర్ సందర్శించడం ఇదే తొలిసారి. పెద్దసార్ హామీతో గ్రామ స్వరూపం మారుతుందని ఆశించాం. కానీ స్థానిక అధికారుల నిర్లక్ష్యం మాకు శాపమైంది. కలెక్టర్ స్పందించి మా గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.
– తోశెం కృష్ణవేణి, గృహిణి, పూబెల్లి

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, వార్డు కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డు కమిటీలకు, వార్డు ఆఫీసర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. గత నెలలో ఆయా వార్డుల్లో లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా కొంత మంది వార్డు ఆఫీసర్లు కమిటీలకు వ్యతిరేకంగా ఎంపిక చేశారని అందిన ఫిర్యాదు మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1 నుంచి 24 వార్డుల ఆఫీసర్లను ఎంపిక చేసిన జాబితాను అక్కడిక్కడే ఆయా వార్డు కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకు ముందు పలువురు నేతలు ఆయా వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. హౌజింగ్ శాఖ పీడీ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కొక్కు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు వారా రవి, పత్తి స్వప్న, డానియేల్, గాలిపల్లి స్వరూప పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ...
ఇల్లెందురూరల్: విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, మాజీ సర్పంచ్ పూనెం కవిత, మంద కుమార్, వడ్ల శ్రీనివాస్, గుగులోత్ భద్రు, ఉపేందర్, రమేష్, వట్టం సావిత్రి, బండి కవిత, కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచ: కార్పొరేషన్ పరిధిలోని ఎర్రగుంట ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ కాలనీలో కామేష్ పర్యటించారు. మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో మంచినీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పైపులైన్ పేరుతో కాలనీలోని రోడ్లను తవ్వి వదిలేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సాయి, జెట్టి నరసింహ, ఎర్రయ్య, నర్సింహారావు, సత్యం పాల్గొన్నారు.

నేడు టీబీజీకేఎస్ నిరసన దీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆధ్వర్యాన బుధవారం కొత్తగూడెంలో జరిగే దీక్షను విజయవంతం చేయాలని నాయకులు మంగళవారం కోరారు. విశ్రాంత ఉద్యోగులు, రిఫరల్ విధానం సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

సింగరేణిలో అవినీతిని అరికట్టండి..


సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో అవినీతిని అరికట్టాలని, ఇంటర్నల్ ఎక్స్‌టర్నల్ రెగ్యులర్ ఉద్యోగాలలో దళారీ వ్యవస్థను అరికట్టాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కోట మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ రెగ్యులర్ ఇంటర్నల్ ఉద్యోగాలలో ఉద్యోగాలు ఇస్తామని, కొంతమంది ఉద్యోగస్తులు, దళారులు, సెక్యూరిటీ మాజీ ఉద్యోగస్తులు కలిసి సింగరేణిలో అవినీతిని పెంచి పోషిస్తున్నట్లు చెప్పారు. సింగరేణిలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు సివిల్ కాంట్రాక్టర్లు ఎటువంటి అర్హతలు లేకున్నా టెండర్లు దక్కించుకుంటున్నారని దీనిని అరికట్టాలని కోరారు. స్పందించిన సీఎండీ పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

సూపర్‌బజార్(కొత్తగూడెం): 2 ఇంక్‌లైన్ పంచాయతీ ప్రజల తాగునీటి శాశ్వత సమస్య పరిష్కారానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిధులు కేటాయించారు. నీటి సమస్యను స్థానిక సీపీఐ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తన నిధుల నుంచి రూ.70 లక్షలు కేటాయించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈ, ఏఈలు, మున్సిపల్ అధికారులు, టూ ఇంక్‌లైన్ మాజీ సర్పంచ్ నగేష్, ఉపసర్పంచ్ సింగిరాల రమేష్, పంచాయతీ కార్యదర్శి నర్మద వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీ, శ్మశానవాటిక నిర్మాణాలకు కూడా నిధులు కేటాయించారు.

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీ రాజారావుపేట గ్రామంలో మంగళవారం తాగునీటి సమస్యకు పరిష్కారం దొరికింది. రక్షిత తాగునీటి పథకం విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురికావడంతో గడిచిన మూడు రోజులుగా ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో యువకులు ఇంటింటికీ వెళ్లి చందా అడిగారు. ఆ డబ్బుతో మెకానిక్‌తో మోటార్‌కు మరమ్మతులు చేయించారు.

బాల్య వివాహాలు నేరం


ఇందిరమ్మ అమృతం ప్యాకెట్లను అందజేస్తున్న సీడీపీఓ సలోమి

జూలూరుపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ చండ్రుగొండ సీడీపీఓ సలోమి అన్నారు. మంగళవారం కొమ్ముగూడెం, పాపకొల్లు, జూలూరుపాడు సెక్టార్ల పరిధిలోని మాచినేనిపేటతండా, గుండెపుడి, పాపకొల్లు–2 అంగన్‌వాడీ సెంటర్లలో జరిగిన కార్యక్రమాలకు ఆమె హాజరై మాట్లాడారు.

బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం 14 – 17 సంవత్సరాల కిశోర బాలికలకు ఇందిరమ్మ అమృతం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, శకుంతల, టీచర్లు బి.లలిత, సీతామహాలక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ


చుంచుపల్లి: దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్

చుంచుపల్లి: పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దీనిలో భాగంగా గ్రామగ్రామాన మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. పెనుబల్లి గ్రామంలో తొలిరోజు రెవెన్యూ సదస్సుకు రైతులు భారీగా హాజరై దరఖాస్తులను సమర్పించారు. వివిధ రకాల భూ సమస్యలపై 175 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ పి.కృష్ణ పర్యవేక్షించగా డీటీ వినయశీల, ఆర్‌ఐలు మంగ్యా, రామ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: భూభారతి చట్టం కింద భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు 802 దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ దారాప్రసాద్ తెలిపారు. భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి భారీగా దరఖాస్తులు చేసుకున్నారని వాటిని కేటగిరీల వారిగా విభజిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. దంతలబోరు గ్రామంలో 111, ఉలవనూరులో 407, శ్రీనివాసకాలనీలో 274 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

జూలూరుపాడు: నల్లబండబోడు, కొమ్ముగూడెం గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు భూ భారతి సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సీహెచ్ ఆదినారాయణ, ఏఎస్‌ఓ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ దేశ్ పాండే, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భూసమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మామిడిగుండాల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, సిబ్బంది కీర్తి, కామేశ్వరరావు, బాలు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

సుజాతనగర్: కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కుటుంబ నియంత్రణ కోసం ప్రభుత్వం అనేక పద్ధతులను ప్రవేశపెట్టిందని, వివాహం తరువాత మొదటి బిడ్డ, రెండో సంతానం కోసం కనీసం మూడేళ్ల వ్యవధి ఉండాలన్నారు. వ్యవధి ఉండటం వలన భార్యతో పాటు పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతీ గర్భిణీ వివరాలను వైద్య సిబ్బంది తప్పకుండా నమోదు చేసి వారు ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

21నుంచి టీయూసీఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పాల్వంచ: ఈనెల 21, 22వ తేదీల్లో నిజామాబాద్‌లో జరగనున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, షేక్.యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... సంఘటిత, అసంఘటితరంగ కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చర్చించి, భవిష్యత్ పోరాటాలు రూపొందించేకునేందుకు ఈ మహాసభలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో గోనెల రమేష్, నూప భాస్కర్, పి.సతీష్, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, మల్సూరు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు


ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న బాబూరావు

సుజాతనగర్: నకిలీ ఎరువులు, పురుగుమందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు అన్నారు. స్థానిక రైతు వేదికలో ప్రభుత్వం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ప్రతీ మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం ఆయన మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. మాట్లాడుతూ... నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయించడానికి వీల్లేదని, పూర్తిగా నిఘా ఉంచామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. అలాగే రైతులు కూడా బిల్లులు లేకుండా ఏ డీలర్ అయినా విత్తనాలు అమ్మితే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నర్మద పాల్గొన్నారు.

గేట్లు ఎత్తితే గ్రామం జలమయం

- వరద ముంచెత్తాకే కళ్లు తెరుస్తారా ?
- ప్రతీ సంవత్సరం వరద ముంపునకు గురవుతున్న కిన్నెరసాని పంచాయతీ
- వర్షకాలం వస్తుందంటే స్థానికులకు గండమే..


కిన్నెరసాని గేట్లు ఎత్తినప్పుడు నివాసాల్లోకి చేరిన వరద(ఫైల్)


ముంపు ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)


పాల్వంచరూరల్: ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా ఊరు సగం నీట మునిగిపోవడం, ఇళ్లలోకి వరద నీరుచేరి సామగ్రి తడిసిపోవడం, ఇళ్ల పైకప్పులు రేకులు, గోడలు కూలిపోవడం సర్వసాధారణం అయింది. అయినా ముందస్తు జాగ్రత్తలు, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందే వచ్చాయి. అయినా అధికారులు వరద ముంపునకు గురయ్యే గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవడం, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించకపోవడంతో ఈసారి కూడా జలగండం తప్పే పరిస్థితి లేదని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్న కిన్నెరసాని గ్రామంలోని ప్రజలు క్షణక్షణం భయంభయంగా జీవనం సాగిస్తున్నారు. మండల పరిధి కిన్నెరసాని గ్రామపంచాయతీ మరియు రాజాపురం గ్రామంలో మొత్తం 200 వందలకు పైగా కుటుంబాలు ఉండగా 1200 మంది జనాభా. గ్రామం కిన్నెరసాని ప్రాజెక్టుకు దిగువ భాగంలో ఉండటం వలన వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా కిన్నెరసాని వాగుకు సమీపంలో ఉన్న నివాసాలు జలమయంగా మారుతున్నాయి. ప్రతీ సంవత్సరం కిన్నెరసాని ప్రాజెక్టుకు చెందిన గేట్లు ఎత్తినప్పుడల్లా గ్రామంలోని ఇళ్లల్లోకి వరదనీరు చేరుతోంది. దీంతో ప్రజలు వరద తగ్గే వరకు సురక్షిత ప్రాంతాలకు కొంతమంది తరలివెళ్తుంటే మరికొంతమంది వరద నీటిలో భయాందోళనలో గడుపుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా రెండేళ్లుగా కిన్నెరసాని జలాశయంలోకి వరద పోటెత్తడంతో ప్రాజెక్టుకు చెందిన 12గేట్లను ఎత్తి 1.10 లక్షల క్యూసెక్కుల వరద నీటిని వాగులోకి వదలడంతో గ్రామంలోని అనేక నివాసాలు వరద ముంపునకు గురవుతున్న పరిస్థితి.

వరద నీటిలోనే నివాసాలు...
వాగు ప్రాంతంలో కిన్నెరసాని, రాజాపురం గ్రామాలు ప్రతీ ఏటా వరద ముంపు బారిన పడుతోంది. నివాసాలు జలమయం అవుతున్నాయి. కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా గ్రామశివారులోని నివాసాలు వరద బారిన పడుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి వరద తగ్గిన తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారు. వరద ముంపు నుంచి ప్రభుత్వం, అధికారులు రక్షించాలని కోరుతున్నారు.

వాగుకు ఒకవైపు గోడ నిర్మించాలి..
కిన్నెరసాని గ్రామం వరద ముంపునకు గురికాకుండా ఉండాలంటే జెన్కో అధికారులు వాగుకు గ్రామం వైపున ప్రహరీ నిర్మాణం చేస్తే కొంతమేరకు వరద ముంపు ప్రమాదం నుంచి బయట పడవచ్చని స్థానికులు అంటున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..
అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక సంవత్సరాలుగా వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. గ్రామంలో 40 ఎకరాల ప్రభుత్వ స్థలం కూడా ఉంది. అక్కడ బాధిత కుటుంబాలకు స్థలం ఇచ్చి ఇళ్లు మంజూరు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు.

ఎమ్మెల్యేకు విన్నవించాం..


కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా కిన్నెరసాని, రాజాపురం గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యేకి కూడా సమస్యను వివరించాం.
– కొంగర అప్పారావు, కిన్నెరసాని

ప్రతిపాదనలు పంపుతా..


కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు వరద ముంపునకు గురవుతున్న నివాసాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతా. అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం.
– కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ

చర్యలు తీసుకుంటాం..


కిన్నెరసాని గ్రామాన్ని వరద ముంపునకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలంటే పైఅధికారుల నుంచి ఆదేశాలు రావాలి. అప్పుడు వారి సూచన మేరకు శాశ్వత చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయి. – ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ ఇంజనీర్

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జూలూరుపాడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆశా డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత, దోమల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. డాక్టర్లు బి.వెంకటేశ్వర్లు, తేజశ్విని, సీహెచ్‌ఓ రామకృష్ణ, హెచ్ఎస్ రత్న కుమార్, హెచ్‌వీలు రాధిక, ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం పూర్తి చేయించండి..

ఇల్లెందురూరల్: దశాబ్దకాలం క్రితం శంకుస్థాపన పూర్తయిన అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన మొండితోగు రహదారి పనులు పూర్తి చేయించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డీఎంఎఫ్‌టీ పథకంలో భాగంగా రూ.2.50 లక్షల వ్యయంతో నిర్మించిన బోర్‌మోటార్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సమస్యలను గ్రామపెద్దలు ఎమ్మెల్యేకు వివరించారు. రహదారి అసంపూర్తిగా ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేయించి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పులి సైదులు, మాజీ సర్పంచ్‌లు కల్తి పద్మ, పాయం స్వాతి పాల్గొన్నారు.

రేపు హెడ్డాఫీస్ ఎదుట ఆందోళన

ఇల్లెందు: సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ ప్రకటించింది. మంగళవారం ఇల్లెందులోని సులభ్ కాంప్లెక్సుల వద్ద ఇఫ్టూ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎండీ రాసుద్దీన్ మాట్లాడుతూ... 200 మంది సులభ్ కార్మికులు ఇంటర్నేషనల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒక్కో సులభ్ కాంప్లెక్స్‌కు సింగరేణి యాజమాన్యం నెలకు రూ.25 వేలు సులభ్ ఏజెన్సీకి చెల్లిస్తుందన్నారు. కానీ కార్మికులకు ఎలాంటి చట్టబద్ధ హక్కులు, బోనస్, లీవులు, పండుగ సెలవులు, బ్యాంకు ద్వారా జీతాలు చెల్లించడం లేదన్నారు. గడిచిన వారం ఇల్లెందులోని సింగరేణి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కె.సారంగపాణి, కె.శ్రీనివాస్, మహేందర్, శాంతక్క, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

మారణహోమం ఆపండి..

ఇల్లెందురూరల్: ఆదివాసీలు, మావోయిస్టులను తుద ముట్టించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మారణహోమం కొనసాగిస్తోందని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు ధ్వజమెత్తారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొమరారం గ్రామంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రజలంతా ఐక్యంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించి కేంద్ర ప్రభుత్వ ఆగడాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జూన్ 14న హైదరాబాద్‌లో అఖిలపక్షం నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

హామీలు అమలు చేయాలి

పాల్వంచరూరల్: ప్రభుత్వ జీఓకు ముందు రిటైర్డ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రూ.2లక్షలు అందజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దమ్మగుడి వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 అక్టోబర్‌లో 24 రోజుల పాటు సమ్మె ఫలితంగా ఇచ్చిన హామీలో భాగంగా రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లకు, రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష అమలు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు నాలుగువేల మంది రిటైర్డ్ అయ్యారని వారికి కూడా ఇప్పటి జీఓ ప్రకారం బెనిఫిట్స్ ఇవ్వాలని, మినీ సెంటర్లకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

పాల్వంచరూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ -2025 ఫలితాల్లో కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 9మంది పరీక్షలు రాయగా జాతీయస్థాయిలో ఎన్.శివ 95 ర్యాంక్, బి.సుద్దు 858, ఆర్.సంతోష్‌కుమార్ 1632, డి.తేజ్ విఠల్ 2365 ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మంగళవారం తెలిపారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు.